# కాంగ్రెస్ వస్తే కరెంటు కోతలే



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

- కాంగ్రెస్, బీజేపీ వాళ్ల మాటలు నమ్మితే గోసపడుతం
- పదేళ్లలోనే ఆదర్శంగా తెలంగాణ
- రానున్న ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే
- సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- చొప్పదండిలో సుంకె నామినేషన్ కార్యక్రమానికి హాజరు

చొప్పదండి, నవంబర్ 8 : కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మోసపూరిత వ్యాఖ్యలను నమ్మి ఓటు వేస్తే రాష్ట్రంలో కరెంటు కోతలు తప్పవని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హెచ్చరించారు. తెలంగాణ వస్తే కరెంటు సమస్య ఉంటుందని ఆనాడు కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. కానీ నేడు 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు. పదేళ్లలోనే తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపామని, ఆ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బుధవారం చొప్పదండి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రచార సభలో మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 35 ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, ఉమ్మడి జిల్లాకు నాలుగు మెడికల్ కాలేజీలను మంజూరు చేయించామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మూడు గంటలే కరెంటు సరిపోతుందని అంటున్నారని, ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు ప్రచారం కోసం వస్తే.. మీరు గతంలో ఏం చేశారు? ఇప్పుడు గెలిస్తే ఏం చేస్తరు? అని నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోతే గోసపడతామని సూచించారు. చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి తన బాధ్యత అని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి సుంకె రవిశంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి –సాంబయ్య, ఎంపీపీలు చిలుక రవీందర్, పర్లపెల్లి వేణు, శ్రీరాం మధుకర్, మేన్నేని స్వర్ణలత–రాజనర్సింగరావు, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య– వినయ్, పునుగోటి ప్రశాంతి–కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, మురళీకృష్ణారెడ్డి, దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, మామిడి తిరుపతి, ఎల్కపల్లి లచ్చయ్య, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్ర శేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి గంట్ల జితేందర్‌రెడ్డి, నవీన్‌రావు, పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కూర్మాచలం

# గంగులను ఆశీర్వదించండి

**ఆయన గెలిస్తేనే మరింత అభివృద్ధి • బీఆర్ఎస్‌ను గెలిపించాలి**

**ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ పౌండర్ అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం**

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 8 : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం చేపడుతున్న బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ ఫౌండర్ అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం కోరారు. మరోసారి గంగుల కమలాకర్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని మంత్రి గంగుల మీసేవా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ గెలుపు కోసం విదేశాల నుంచి తమ ప్రతినిధులతో వచ్చి నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ వంతుగా పాత్ర పోషించామని గుర్తు చేశారు. ఈ పదేళ్ల కేసీఆర్ పాలనలో కరీంనగర్ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. మంత్రి గంగుల కమలాకర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని యూఎన్ఓ కూడా గుర్తించిందన్నారు. నియోజకవర్గాల్లోని ప్రతి ఎన్ఆర్ఐ కుటుంబాన్ని కలుసుకొని ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటు వేసే విధంగా కృషి చేస్తామన్నారు. పార్లమెంట్‌లో పది నిమిషాలు కూడా మాట్లాడలేని ఎంపీ బండిసంజయ్ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించుకోలేక ఎంతో నష్టపోయమని, అలాంటి పరిస్థితిని మళ్లీ తెచ్చుకోవద్దని కోరారు. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ కూడా కాంగ్రెస్ పార్టీ అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితంగా ఉంటుందని, బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధులు రత్నాకర్ కాడుదుల, ప్రవీణ్, మారుతి, మల్లేష్, తేజ, గణేశ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి రసమయికి మద్దతు ప్రకటిస్తున్న కూకట్‌పల్లి పరిశీలకుల బృందం

# దొంగమాటలను నమ్మద్దు

- కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ లేదు • కవ్వంపల్లి మాటలకు వారెంటే లేదు
- ఊర్లకు వచ్చే పగటిబిచ్చగాళ్లను తరమికొట్టాలి • చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయండి • మానకొండూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి

మానకొండూర్ రూరల్, నవంబర్ 8: కాంగ్రెస్ ఇచ్చే ఆరు హామీలకు గ్యారెంటీ లేదు. మానకొండూర్ ఆ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి మాటలకు వారెంటీలేదు' అంటూ మానకొండూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దొంగమాటలతో ఊర్లకు వచ్చే వాళ్లను నమ్మదద్దని, ఆ పార్టీ పగటి బిచ్చగాళ్లను పొలిమేరల దాకా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తొమ్మిదన్నరేండ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి, మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, రంగపేట గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేశారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మళ్లీ గెలిపిస్తే చేయబోయే పనులను వివరిస్తూ ఓటేయాలని కోరారు. అనంతరం రసమయి మాట్లాడారు. దాదాపు యాభై ఏండ్లు అధికారం అనుభవించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఒక్కచాన్స్ ఇవ్వాలంటూ అడగడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. తెలంగాణను సాధించి అనంతరం అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా రైతుబంధు, రైతుబీమా లాంటి బృహత్తర పథకాలను అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రజలు ఆలోచించి పనిచేసేవారికే ఓటేయాలని కోరారు. జీవీఆర్ మాట్లాడుతూ, ప్రజల కోసం తపించే రసమయిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాగా శ్రీనివాస్‌నగర్‌లో మాజీ సర్పంచ్ ఎరుకల భాగ్య–శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యేకు నామినేషన్ వేసేందుకు ఖర్చులకు ₹5 వేల నగదును అందజేశారు. జగ్గయ్యపల్లిలో పార్టీలో చేరిన దాదాపు 40 మందికి ఎమ్మెల్యే, జీవీఆర్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరగంగా ఆహ్వానించారు. జగ్గయ్యపల్లిలో కూకట్‌పల్లికి చెందిన పరిశీలకుల బృందం సీహెచ్ దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు తమ మద్దతు ప్రకటించారు. ప్రతి గ్రామానికి చేరుకున్న రసమయి బాలకిషన్‌కు, జీవీఆర్‌లతో పాటు ప్రముఖులకు ఆడబిడ్డలు, కోలాట మహిళలు,డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బతుకమ్మలతో, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల ప్రకాశ్, గడ్డం నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మీ రీజినల్ హెడ్ కే సత్యనారాయణ, పక్కన కరీంనగర్ బ్రాంచి మేనేజర్ ప్రభాకర్, హాజరైన వినియోగదారులు

# వినియోగదారులకు నిరంతర సేవలు

**14 రాష్ట్రాల్లో 255 శాఖల ఏర్పాటు • ధనలక్ష్మీ బ్యాంకు రీజినల్ హెడ్ కే సత్యనారాయణ**

కరీంనగర్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి: వినియోగదారులకు నిరంతర సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ధనలక్ష్మీ బ్యాంకు రీజినల్ హెడ్ కే సత్యనారాయణ తెలిపారు. బ్యాంకు 97 ఏళ్ల వసంతాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో కస్టమర్లతో సమావేశం నిర్వహించారు. దీనికి కరీంనగర్ బ్యాంకు మేనేజర్ కే ప్రభాకర్ అధ్యక్షత వహించగా, బ్యాంకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని.. రీజినల్ హెడ్ సత్యనారాయణ మాట్లాడుతూ కేరళలో పుట్టిన ధనలక్ష్మీ బ్యాంకు ప్రస్తుతం 14 రాష్ట్రాలకు విస్తరించి సేవలందిస్తుందన్నారు. భవిష్యత్‌లో దేశమంతా విస్తరింపజేసేందుకు తమ యజమాన్యం అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 255 బ్రాంచిలను ప్రారంభించి, వాటి ద్వారా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని తెలిపిన సత్యనారాయణ, త్వరలో వరంగల్‌లో కొత్తగా బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన బ్యాంకులకు దీటుగా, ఒక్క మాటలో చెప్పాలంటే అంతకు మించి వినియోగదారులకు సేవలందిస్తున్నామన్నారు. అందుకే.. 97 ఏళ్లుగా అంచలంచెలుగా బ్యాంకు విస్తరణ చేయగలుగుతున్నామని చెప్పారు. తమ బ్యాంకు ఖాతాదారులను ఏనాడూ వినియోగదారులుగా తాము భావించడం లేదని, వారందరనీ ధనలక్ష్మీ బ్యాంకు కుటుంబ సభ్యులుగానే భావిస్తున్నామన్నారు. బ్యాంకులో అన్ని వర్గాలకు తగిన విధంగా అకౌంట్లు ఓపెన్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ప్రధానంగా మహిళలకు, మహిళా ఉద్యోగులకు సంబంధించి పలు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నేటి యువతీ యువకులను పొదుపు ప్రోత్సహించేందుకు వినూత్న పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మున్ముందు బ్యాంకు సేవలు మరింత విస్తరిస్తామన్నారు. కరీంనగర్ అద్భుతంగా విస్తరిస్తున్న నగరమని, అందుకే తమ బ్రాంచ్‌ను గతేడాది కరీంగనర్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. అనతికాలంలోనే అనేక మంది వినియోగదారుల ఆదరణ పొందడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు మాట్లాడుతూ.. ధనలక్ష్మీ బ్యాంకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇతర బ్యాంకుల్లో అందుబాటులో లేని అనేక సౌకర్యాలు అందడమే కాకుం డా.. తక్కువ కాలంలో రుణాలు మంజూరు చేసి.. ఔత్సాహిక వ్యాపారులను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. వినియోగదారులుగా ఏమి కోరుకుంటున్నామో ఆ సేవలు బ్యాంకు నుంచి అందుతున్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. అందుకే బ్యాంకు భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో బ్యాంకు సిబ్బందితోపాటు.. పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.